


హైదరాబాద్ వార్త

# ఇన్‌చార్జీలతో.. ఇంకెన్నాళ్లు

## మిగతా రోజులు దర్శనమిస్తున్న తాళం కప్పలు

## అనుమతుల కోసం ఇబ్బందులు పడుతున్న నిర్మాణదారులు




దుండిగల్ మున్సిపల్ కార్యాలయం

**దుండిగల్ మున్సిపల్ ఆవిర్భవించి నాలుగేళ్లు**
**నేటికి పట్టణ ప్రణాళిక విభాగానికి ఇన్‌చార్జిలే దిక్కు**
**వారంలో ఒకటి, రెండు రోజులే విధులకు హాజరు**

దుండిగల్, ఆగస్టు 5 ప్రభాతవార్త : శరవేగంగా విస్తరిస్తున్న నగరాన్ని అదేవేగంతో అభివృద్ధి చేయాలని భావించిన ప్రభుత్వం నాలుగేళ్ళ క్రితం కొత్త పురపాలికలు, నగరపాలికలను ఏర్పాటు చేసింది. అయితే పురపాలిక అయినా, నగరపాలిక అయినా అభివృద్ధిలో కీలకమైనది పట్టణ ప్రణాళిక విభాగం. అటువంటి విభాగం పురపాలిక ఆవిర్భావం నాటి నుండి నేటి వరకు ఇన్‌చార్జిలతోనే కొనసాగుతుంది. వివిధ మున్సిపాలిటీలలో విధులు నిర్వర్తిస్తున్న టిపివోలకు ఇక్కడ ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించడంతో వారంలో ఒకటి, రెండురోజులు విధులకు హాజరవుతూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఆ విభాగం పూర్తి గాడీతప్ప అక్రమ నిర్మాణదారులకు స్వర్గధామమైంది. అదే మున్సి పాలిటీలో కమీషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులను ఈ విషయమై ఎవరైనా అడి గితే పట్టణ ప్రణాళిక విభాగం పరిస్థితి తెలుసుకదా, మేము ఉన్నతా ధికారులకు మొరపెట్టుకుంటున్నాము అయినా పూర్తిస్థాయి టిపివోను నియమిం చడం లేదని దాటివేస్తున్నారు. నగరశివారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి లోని గాగిల్లాపూర్, దుండిగల్, దొమ్మరపోచంపల్లి, బహాదూర్‌పల్లి, భౌరంపేట, మల్లంపేట పంచాయతీలను కలిపి దుండిగల్ మున్సిపాలిటీగా 2ఆగస్టు2018న ఆవిర్భవించింది. మున్సిపాలిటీకి ఇన్‌చార్జి కమీషనర్‌గా అప్పటివరకు అక్కడే ఇవోఅండ్‌పిఆర్‌డి పనిచేస్తున్న ఎ.జ్యోతిరెడ్డిని నియమించింది. షాద్‌నగర్ టిపివోగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీధర్‌ను ప్రట్టణప్రణాళిక విభాగానికి ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన వారంలో రెండు రోజులు ఇక్కడ విధులు నిర్వరిస్తుండేవారు. తొమ్మిది నెలల తరువాత పూర్తిస్తాయి కమీషనర్‌ను నియమించిన నేటికి పూర్తిస్థాయి టిపివో నియామకం జరుగలేదు.

**వారంలో ఒకటి రెండు రోజులే విధులకు హాజరు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందే ఆధారం**

దుండిగల్ మున్సిపాలిటీ ఆవిర్భవించి నాలుగేళ్ళు అవుతున్న పట్టణప్రణాళిక విభాగానికి పూర్తిస్తాయి టిపివో నియమాకం జరగలేదు. వివిధ మున్సిపాలిటీలు, జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న టిపివోలకు ఇక్కడ ఇన్‌చార్జీలుగా బాధ్యతలు అప్పగించారు. సదరు టిపివోలు వారంలో ఒకటి,రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. మిగితా రోజులు టిపివో గది తాళం కప్పతో దర్శనమిస్తుంది. దీంతో అనుమతుల కోసం వచ్చే నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపైనే ఆధారపడి ఈవిభాగం నడుస్తుందని చెప్పవచ్చు. చైన్‌మెన్‌లుగా ఆరుగురు పనిచేస్తుండగా కంప్యూటర్ ఆపరేటర్లుగా ఇద్దరు పనిచేస్తున్నారు. అను మతులు కోసం కార్యాలయంకు వచ్చేవారికి కంప్యూటర్ ఆపరేటర్లు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.




తాళం వేసి ఉన్న టిపివో గది

**రియల్‌వ్యాపారుల చూపు దుండిగల్ వైపు..** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో గత మూడు సంవత్సరాలుగా రియల్‌వ్యాపారం జోరందు కుంది. నగరశివారు కావడంతో పాటు ఔటర్‌రింగురోడ్డు ఉండడంతో బడాబడా రియల్ వ్యాపారులు ఈప్రాంతంలో మొగ్గుచూపుతున్నారు. ఇండిపెండెంట్ విల్లాలు, బహుళ అంతస్థుల అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణరంగం ఉవ్వెత్తున్న కొనసాగుతుంది. దీనిద్వారా మున్సిపల్ అభివృద్ధి మరింత వేగవంతం కానుంది. అటువంటి మున్సిపాలిటీకి పూర్తిస్థాయి టిపివో లేకపోవడం శోచనీయం.

**ఇన్‌చార్జీలుగా పనిచేసిన టిపివోలు..** మున్సిపల్ ఆవిర్భావమైన రోజు (2ఆగస్టు 2018)నుండి షాద్‌నగర్ టిపివో శ్రీధర్ మూడునెలల పాటు పనిచేశారు. వారంలో రెండురోజులు ఇక్కడి విధులు నిర్వర్తిస్తుండేవారు. గజ్వేల్ టిపివో పావని నాలుగు నెలలు పనిచేసి వారంలో ఒక్కరోజు వచ్చేవారు. మళ్ళీ షాద్‌నగర్ టిపివో శ్రీధర్ నాలుగు నెలలు పనిచేసి రెండురోజులు వస్తుండేవారు. ముసాపేట టిపివో సత్యనారాయణ ఏడాదికాలం పనిచేసిన ఆయన వారంలో రెండురోజులు వచ్చేవారు. కామారెడ్డి టిపివో శైలజ 10నెలల పాటు పనిచేసి ఒక్కరోజు వస్తుండేవారు. అంబర్‌పేట్ టిపివో సాయిబాబా ఏడాదికాలం పనిచేసిన ఆయన రెండురోజులు వచ్చేవారు. ముసాపేట్ టిపివో మేఘన రెండునెలలు పనిచేసిన ఆమె ఒక్కరోజు వస్తుండేవారు. ప్రస్తుతం గత మూడు నెలల నుండి అంబర్‌పేట్ టిపివో సాయిబాబా ఇన్‌చార్జి పనిచేస్తున్నారు. వారంలో రెండు రోజులు మున్సిపల్‌కు వస్తున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం : కమీషనర్ భోగీశ్వర్లు**

ఈ విషయమై మున్సిపల్ కమీషనర్ భోగీశ్వర్లును వివరణ కోరగా ఈవిధంగా స్పందించారు. పూర్తిస్థాయి టిపివో లేకపోవడం ఇబ్బందికరమే. ఉన్న సిబ్బందితో జాప్యం లేకుండా పనులు జరిగేలా చూస్తున్నాం. పూర్తిస్థాయి టిపివో విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిబంధనలకు అనుగుణంగా పని చేస్తున్నామన్నారు.



# రాఖీ సందడి



రాఖీ.. అన్నా చెల్లెళ్ల రక్త సంబంధంతో కూడుకున్న పండుగ. సెంటిమెంట్‌తో కూడిన ఈ రాఖీ పండుగ కోసం అక్కా చెల్లెళ్లు, అన్నదమ్ములు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. ఎంత దూరంలో ఉన్నా తోబుట్టువులందరూ రాఖీ ద్వారా తమ సోదర ప్రేమను కుటుంబ సభ్యులకు అందజేస్తుండడం మహిళల ప్రత్యేకత.

కరోనా లాక్ డౌన్ లాంటి పరిస్థితులను ఎదుర్కొన్న ప్రజానీకం ఈ సారి కరోనా తగ్గడంతో కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. రాఖీ పండుగను ఈ సారి చాలా ఆనందంగా జరుపుకునేందుకు సోదరీ మణులు సిద్ధమవుతున్నారు. హైదరాబాద్‌నే తీసుకుంటే ఇక్కడి ధూల్ పేటలో జెర్సీ, చెమ్ కీ రాఖీలు తయారు అవుతాయి.

- **కిందటేడాది పండుగకు కరోనా ప్రభావం**
- **ఈ సారి 30 శాతం పెరిగిన రాఖీల ధరలు**

హైదరాబాద్ ఆగస్టు 5 ప్రభాతవార్త : రక్షా బంధన్‌గా పిలుచుకునే రాఖీ పౌర్ణమి పండుగ మహిళలకు ఎంతగానో ఇష్టం. రాఖీ పౌర్ణమి రోజున గ్రేటర్ హైదరాబాద్ ప్రాంత మంతా కూడా అన్నా చెల్లెళ్లు ఆత్మీయంగా జరుపుకుంటారు. చెల్లికి అన్న ఎప్పుడు రక్షగా ఉంటానని ప్రమాణం చేసి భరోసా కల్పించడం రాఖీ పండుగ ముఖ్య ఉద్యేశం. రాఖీ పండుగ అనేది కేవలం అన్నా చెల్లెళ్ల బంధం మాత్రమే కాదని ఎల్లప్పుడు చెల్లి కుటుంబానికి అండదండగా నిలవడమని చెబుతారు. శ్రావణ మాసంలో వచ్చే రక్షా బంధన్ ఈ నెల 11 అని కొందరు అంటుంటే కాదు కాదు ఈ నెల 12నే అని మరి కొందరు చెబుతున్నారు. ఈ రెండు తేదీలలో ఎప్పుడు వచ్చినా రాఖీలు కట్టేందుకు మాత్రం సోదరీ మణులు సిద్దమ వుతున్నారు. నేరుగా వెళ్లి రాఖీని కట్టే అవకాశం ఉండడం కొందరికి అదృష్టంగా భావిస్తుంటే.. ఇతర రాష్ట్రాలు దేశాలలో ఉండే వారికి పోస్ట్ లేదా కార్గో సర్వీసులు లేదా విమానాశ్రయాల ద్వారా ఎవరికి తోచిన విధంగా వారు పార్సీళ్లను పంపించేందుకు ఆసక్తిని కనబరుస్తుంటారు. ఒకటి రెండు సంవత్సరాల కిందట కరోనా లాక్ డౌన్ లాంటి పరిణా మాలు ఎదుర్కొన్న చెల్లెళ్లు ఈసారి పరి స్థితులు అనుకూలంగా ఉన్నా యని తప్పని సరిగా అన్న తమ్ముళ్ల ఇంటికి వెళ్లి రాఖీ కట్టి వస్తామని సోదరీ మణులు చెబుతున్నారు.

రాఖీలు కట్టేందుకు సోదరీ మణులు రెడీ.. రాఖీ పౌర్ణమి ఈ నెల 11నా ? లేదా 12 నా ? అన్న దానిపై పలువురిలో సందిగ్ధత నెల కొంది. అయితే పౌర్ణమి తిథి ఆగస్టు 12వ తేదీన సూర్యోదయానికి ముందు వస్తుంది కాబట్టి ఆ రోజంతా పౌర్ణమి తిథిగానే పరిగణించ బడుతుందని పలువురు చెబుతుంటే కాదు ఈ నెల 11నే అని మరి కొందరు చెబుతున్నారు. తిథి ప్రకారంగా ఈ రెండు తేదీలలో ఎప్పుడు వచ్చినా రాఖీలు కట్టేందుకు మాత్రం సోదరీ మణులు సిద్దమవుతు న్నారు. నేరుగా వెళ్లి రాఖీని కట్టే అవకాశం ఉండడం కొందరికి అదృష్టం గా భావిస్తుంటే.. ఇతర రాష్ట్రాలు దేశాలలో ఉండే వారికి పోస్ట్ లేదా కార్గో సర్వీసులు లేదా విమానాశ్రయాల ద్వారా ఎవరికి తోచిన విధంగా వారు పార్సీళ్లను పంపించేందుకు ఆసక్తిని కనబరుస్తుంటారు. ఏడాది పొడవునా ఎంతో కష్టపడి రాఖీలను తయారు చేస్తారు. ఎంతో కష్టంతో కూడుకున్న పని అని ధూల్‌పేట వాసులు చెబు తున్నారు. జెర్సీ, చెమ్‌కీవి కాకుండా మరింత మంచి క్వాలిటీకి డిజైన్ల రాఖీలు కోరుకునే వినియోగదారుల కోసం హైదరాబాద్ వ్యాపారులు రాఖీలను కలకత్తా, అహ్మదాబాద్, ఢిల్లీ రాజ్‌కోట్ నుండి పార్సిల్ ద్వారా నెల రోజుల ముందే తెప్పించుకుంటారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎక్కడ ఏ గల్లీ చూసినా రాఖీల సందడి కనిపిస్తోంది. విభిన్న రకాలు.. ముఖ్యంగా స్టోన్స్ రాఖీలు, కుందన్ రాఖీలు, పల్స్ రాఖీలు, భయ్యా భాభీ రాఖీలు ఓల్డ్ మోడల్ జరీ రాఖీలు .. చిన్నారులు కట్టుకునే కిడ్స్‌వేర్ రాఖీలు ఇలా ఎన్నో రకాలు మోడళ్ల రాఖీలు ప్రస్తుతం మార్కెట్లో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఈ సారి పరిస్థితులు కాస్త మెరుగవడంతో విక్రయాలు కాస్త ఆశాజనకంగా ఉంటాయని వ్యాపారులు భావిస్తున్నారు. అయితే ధరలు మాత్రం ఈ సారి కిందటి ఏడాది కంటే కూడా 30 శాతం పెరగాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరిగినట్టే ఈ సారి రాఖీ ఉత్పత్తులకు సంబంధించిన ముడి సరుకుల ధరలు కాస్త పెరిగాయని ఈ కారణంగా రాఖీల ధరలు 30శాతం పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ధరలు పెరగడం పట్ల వినియోగదారులు భగ్గు మంటున్నారు. మరీ కాదనుకుంటే 10 శాతం పెంచుకోవాలి గానీ ఏకంగా 30 శాతం పెంచేసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై వ్యాపారులు మాత్రం విధి లేని పరిస్థితుల్లోనే ధరలు 30 శాతం పెరిగాయని సికింద్రాబాద్ మహంకాళి టెంపుల్ సమీప రాఖీల వ్యాపారి గంగారపు మాధవ్ ప్రభాతవార్తకు తెలిపారు.

# అజాదికా అమృత్ మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

## కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి



తివర్ణ పతాకాన్ని చేబూని ప్రసంగిస్తున్న జి.కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త: అజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు హిమాయత్‌నగర్ డివిజన్‌లో బిజెపి నేతలు, కార్యకర్తలు సమావేశమైనారు. ఈ సమావేశంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, రాష్ట్ర నాయకుడు జి.రామన్‌గౌడ్ తదితరులు విస్తృతంగా చర్చిండం జరిగింది. ఈ సందర్భంగా జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ కనివిని ఎరగని రీతిలో ఆగస్టు 15వ తేదీ వరకు అజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టాలని ఇందుకు నాయకులు, కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరాలని, ప్రతి పౌరుడిలో దేశభక్తి పెంపొందించాలని కోరారు. ఒక్క హిమాయత్‌నగర్ డివిజన్‌లోనే 12 వేల 500 అపార్ట్‌మెంట్‌లు, ఇళ్ళు ఉన్నాయని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని చెప్పారు. ఈ మేరకు డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్ రూపొందించిన జెండాను క్రరను ఆయన పరిశీలించి అవిష్కరించారు. కార్యకర్తలు జెండాలను అవిష్కరించడంలో కీలకపాత్రను పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పి.ప్రసాద్, నిర్సంగ్‌ముదిరాజ్, శేఖర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ పిస్తోల్‌తో కాల్పులు..

# బాలుడికి గాయాలు

చార్మినార్, ఆగస్టు 5 ప్రభాతవార్త : ఎయిర్ ఫిస్తోల్‌తో జరిపిన కాల్పులలో ఓ చిన్నారి గాయ పడిన సంఘటన మొగల్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సుల్తాన్‌షాహి ప్రాంతానికి చెందిన అబ్దుల్ అఫ్సర్ (30) హోటల్‌తో పాటు వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నాడు. తాను కొనుగోలు చేసిన ఎయిర్ గన్‌తో తనకు సంబంధించిన హోటల్ గోడలపై కనిపించే బల్లులపై ఆగష్టు నెల ఒకటివ తేదీ 11 గంటల సమయంలో అఫ్సర్ కాల్పులు జరిపాడు. అదే సమయంలో అబ్దుల్ అఫ్సర్ బంధువుల కుమారుడు (9) హోటల్ సమీపంలోకి రావటంతో అఫ్సర్ కాల్చిన గుండు గోడకు తగిలి తరిగి చిన్నారి భుజానికి తగలటంతో గాయమైంది. గాయల పాలైన మైనర్ బాలుడు పాతబస్తీ బహదూర్‌పురలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసును మొగల్‌పుర సిఐ శివకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.



బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో శ్రావణ మాసం ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

## స్నేహితుడి హత్య కేసులో

# నలుగురు యువకుల అరెస్టు

సైదాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త: పాత కక్షల నేపథ్యంలో తోటి స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన నలుగురు నిందితులను సైదాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చంచల్‌గూడ రెయిన్ బజార్‌లో నివసించే ఎండి నసీర్ హుస్సేన్(32) మాదన్నపేటలో ఉండే జావెద్ ఖాన్ (32), చంచల్‌గూడలోనే ఉండే ఎండి హబీబ్(34), కలీమ్ ఉద్దీన్, బండ్లగూడకు చెందిన షేక్ మహ్మద్(34)లు స్నేహితులు. అయితే నసీర్ హుస్సేన్ కొంత కాలంగా డబ్బుల గురించి జావెద్‌ఖాన్, హబీబ్, షేక్ మహమూద్, కలీమ్ ఉద్దీన్‌లను వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు శ్రుతి మించడంతో ఎలాగైనా నసీర్ హుస్సేన్‌ను అంతమొం దించాలని నిర్ణయించుకున్నారు. పథకంలో భాగంగా ఈ నెల ఒకటో తేదీన నసీర్‌కు ఫోన్ చేసి అతడిని రప్పించి చంద్రాయణగుట్ట, దోభిఘాట్‌లలో మద్యం త్రాగించారు. అనంతరం ఆటోలో సరూర్‌నగర్ చెరువు కట్టవద్దకు తీసుకువెళ్లి బ్లేడుతో గొంతు కోసి చెరువులో పడవేశారు. అయితే స్థానికంగా పనులు చేస్తున్న కార్మి కులు కొంతమంది నీటిలో తేలుతున్న మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు ఇక్బాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్పెషల్ టీంను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. తూర్పు మండలం డిసిపి చక్రవర్తి పర్యవేక్షణలో మలక్‌పేట ఎసిపి వెంకటరమణ, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ కె.సుబ్బరామిరెడ్డి, డిఐ బి.చంద్రమోహన్, ఎస్ఐలు జి.హరికృష్ణారెడ్డి, జె.నవీన్‌లు నిందితులను అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

# ఎమ్మెల్సీ నిధులతో అభివృద్ధి పనులు



ప్రభుత్వ విప్ ప్రభాకర్‌రావుకు బోకె అందచేస్తున్న నాంపల్లి ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్

గన్‌ఫౌండ్రి, ఆగస్టు 5 ప్రభాతవార్త: నాంపల్లి నియో జకవర్గంలోని ఎమ్మెల్సీ నిధులతో అనేక అభి వృద్ధి పనులను చేప ట్టడం జరుగుతుందని టిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆసిఫ్‌నగర్ డివిజన్ పరిధిలోని దైహిబాగ్‌లో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ ఎం.ఎస్ ప్రభాకర్‌రావు నిధులతో 15లక్షల 50వేల వ్యయంతో అభివృ ద్ధి పనుల్లో భాగంగా సిసి రోడ్డు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలో మంచినీటి, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు,వీధి దీపాలు,పెన్షన్లు తదితర విషయాలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో ఆసిఫ్‌నగర్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు సి.లక్ష్మి నారాయణ, విద్యాసాగర్, ఎస్.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, ఎం.సాయిశిరిష, గురునాథ్, జి.యాదయ్య, అశోక్‌శెట్టి, జి.జగదీష్ పాల్గొన్నారు.

# హిందుత్వంపై జరుగుతున్న దాడిని అరికట్టాలి

## వీహెచ్‌పీ నేతల డిమాండ్



షిఫలీకుమార్‌కు వినతి పత్రం అందచేస్తున్న వీహెచ్‌పీ నేతలు

ధర్నాచౌక్, ఆగస్ట్ 5, ప్రభాతవార్త: వెండితెర, బుల్లితెర, స్మార్ట్‌ఫిల్మ్స్, యూట్యూబ్ ఛానల్స్ ద్వారా హిందుత్వంపై జరుగుతున్న దాడిని అరికట్టాలని వీహెచ్‌పీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వీహెచ్‌పీ నేతలు కవాడిగూడ, సీజీవో టవర్స్‌లోని భారత సమాచార ప్రభుత్వానికి సంబంధించిన కేంద్ర చలనచిత్ర పరిశ్రమ డైరెక్టర్ షిఫలీ కుమార్ కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో హిందుత్వాన్ని అవమానపరిచే విధంగా సన్నివేశాలు చిత్రీకరిస్తూ ద్వంద్వార్థాలు వచ్చే విధంగా డైలాగులు రాయటం, హిందూ దేవి దేవతలను అవమానిస్తూ, హిందూ సాంప్రదాయాలను అగౌరపరిచేవిధంగా ఆధ్యాత్మికతపై దాడికి దిగుతూ కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. భావప్రకటన పేరుతో ఇటువంటి బరితెగింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు వీరన్నగారి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, నాయకులు ఎడ్ల జగన్ పాల్గొన్నారు.

# మైనింగ్ వ్యాపారం కోసమే ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి రాజీనామా

## ఒయు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

తార్నాక, ఆగస్టు 5 ప్రభాతవార్త: ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి మైనింగ్ వ్యాపారం కోసమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని ఒయూ ప్రొ.గాలివినోద్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒయూలో మాట్లాడుతూ మునుగోడు నియోజక వర్గం అభివృద్ధికి ఆయన ఏమి చేయలేదన్నారు. ఇప్పటికైనా బీసీలంత ఐక్యంగా ఉండి రాజ్‌గోపాల్‌రెడ్డిని ఓడించాలని సదరన్ పొలిటికల్ అకాడమీ అధ్యక్షులు ఓ.యూ ప్రొ. గాలి పిలుపు నిచ్చారు. ఆయన మైనింగ్ బిజినెస్ కోసమే పార్టీ మారుతున్నారని ఇప్పటికైనా మునుగోడు నియోజక వర్గంలో 52 శాతం ఉన్న బీసీలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపారాల కోసమే వారు రాజకీయాల్లో ఉన్నారని ఆరోపించారు. దక్షిణ భార త పరిశోధక విద్యార్థి జేఏసీ నాయకులు దుర్గం శివ, శ్రీనివాస్, చరణ్ పాల్గొన్నారు.



మొహర్రం ఊరేగింపు సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో శుక్రవారం ఏనుగు రిహార్సల్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

# కరోనా వ్యాక్సిన్ తప్పనిసరి

చిక్కడపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త: కరోనా వైరస్ నుంచి ప్రతి ఒక్కరు సురక్షితంగా ఉండాలంటే వ్యాక్సిన్ తప్పకుండా తీసుకోవాలని టిఆర్ఎస్ రాష్ట్ర నేత, విఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అన్నారు.

# ధనలక్ష్మీ దేవిగా అమ్మవారు



**వివేకానందనగర్ కాలనీ..** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి లోని ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో గల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవస్థానంలో శ్రావణమాస రెండో శుక్రవా రాన్ని పురష్క రించుకుని భ్రమరాంబ అమ్మవారిని ధనలక్ష్మి దేవి అమ్మవారిగా అలంకరించారు. ఆల్విన్‌కాలనీకి చెందిన పలువురు భక్తులందరూ ఆలయానికి వచ్చి భ్రమరాంబ సహిత ధనలక్ష్మి దేవి అమ్మవారిని దర్శించుకుని ధనలక్ష్మి దేవి అమ్మవారి అనుగ్రహం పొందారు.


**కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవాలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం**



పవిత్ర శ్రావణమాసాన్ని పురష్కరించుకుని కెపిహెచ్‌బి కాలనీ రోడ్డు నెంబర్ 3లో గల శ్రీశ్రీశ్రీ కామాక్షి సమేత ఏకాంబరేశ్వ స్వామి దేయాలయంలో వరలక్ష్మి వ్రతం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పీవీ రమణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని కామాక్ష్మమ్మగా ప్రత్యేకంగా పూజించి డబ్బులు నోట్లతో అందంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.




# ఆలయాల్లో శ్రావణ శోభ - దర్శనంకోసం భక్తుల బారులు


పద్మావతి అమ్మవారికి పూజలు చేస్తున్న పురోహితుడు


సంతోషి మాతకు పూజలు చేస్తున్న పురోహితులు


అష్టలక్ష్మి అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న దృశ్యం


దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న సురేఖభాస్కర్‌రెడ్డి దంపతులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** శ్రావణమాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వాసవికాలనీ శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సువర్ణ పుష్పాలతో అమ్మవారికి అర్చన చేశారు. ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ బంగారు వస్త్రాలతో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయంలో శుక్రవారం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, అయిత అంజయ్యగుప్తా, దామోదర్‌గుప్తా, గంప జగన్, దాచేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం దేవాలయ ప్రధాన అర్చకులు మడిగంటి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

**స్నేహపురికాలనీలో...** కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీలోని శ్రీపద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామివారి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు, వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ వంశీ, మేనేజర్ రవీందర్ పాల్గొన్నారు.

**దిల్‌షుక్‌నగర్‌లో...** దిల్‌షుక్‌నగర్ సంతోషిమాత ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా దేవాలయంలో మహిళలు సంతోషిమాత అమ్మవారికి ఉద్యాపన చేశారు.

**భాస్కర్‌రెడ్డి ప్రత్యేక పూజలు...** అష్టలక్ష్మీఆలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, సురేఖ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుక ఉపేందం్‌రెడ్డి, మధుర, పున్న గణేష్‌నేత, బండి మధు, నల్లెంకి ధనరాజ్ గౌడ్, లక్ష్మీ, ఎన్ఎస్‌యుఐ శివ పాల్గొన్నారు.

# మోడీ చేతగానితనం వల్లే ధరల పెరుగుదల : చల్లా


కాంగ్రెస్ ధర్నాకు ర్యాలీగా తరలివెళ్తున్న చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** బిజెపి పాలనలో దేశంలో సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజల బతుకులు భారంగా మారాయని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడి చేతగానితనంవల్ల దేశంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక మాంద్యం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ టిపిసిసి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి ఆయన శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గంనుండి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా అక్కడ టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ అధ్యక్షతన ఎఐసిసి కార్యదర్శి బోసురాజు, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్ తదితర ప్రముఖ నేతలు పాల్గొన్న ఆందోళనలో చల్లా మాట్లాడుతూ కేంద్రంలో నాటి కాంగ్రెస్ పాలనలో ప్రధాని మన్మోహన్ సింగ్ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణల వల్ల ధరలు నియంత్రణలో ఉండేవని అన్నారు. అయితే ఎనిమిదేళ్ళ మోడి పాలనలో ధరలు ఆకాశాన్నంటి సామాన్యులు సంతోషంగా ఉండలేని దుస్థితి నెలకొందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశం బాగుపడుతుందని ఆయన తెలిపారు. కాగా ఈ ధర్నాకు డిసిసి ఉపాధ్యక్షుడు ఎరుకల వెంకటేశ్‌గౌడ్, మీర్‌పేట్ కార్పొరేటర్లు చల్లా కవితా బాల్‌రెడ్డి, సిద్దాల మౌనిక శ్రీశైలం, నాయకులు కీసర యాదిరెడ్డి, కృష్ణ, సురేందర్‌రెడ్డి, ఐతరాజు భాస్కర్, పరశురాం, చల్లా ప్రభాకర్‌రెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, గెల్లు సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు, కాలనీల ప్రతినిధులు

**హయత్‌నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఆర్ఎస్ డివిజన్ కమిటి అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు రాకేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఆయా కాలనీల ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీతారాంపురం కాలనీలో సీసీరోడ్లు, తాగునీటి పైప్‌లైన్ పనులు, శ్రీరామ్‌నగర్‌కాలనీలో సీసీరోడ్లు, హనుమాన్‌నగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీను పరిష్కరించడంతో పాటు లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించడం కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ సోషల్‌మీడియా అధ్యక్షుడు మెఘావత్ హరి కృష్ణ, కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్‌నాథ్, విఠల్, ప్రభాకర్‌రెడ్డి, సుభాషిణి, సోమిరెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకట రమణ, నాగాచారి, సాయికిరణ్, లింగస్వామి పాల్గొన్నారు.

# వనస్థలిపురం ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి

## సంబంధిత వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : సామ రంగారెడ్డి


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాయకులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం మూలంగానే ఓ గిరిజన మహిళ తన శిశువును కోల్పోయిందని బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడ సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిలు ఆరోపించారు. గత రాత్రి సరిత అనే యువత ప్రవససమయంలో ఆసుపత్రిలో సరైన వైద్యం అందక శిశువు కోల్పోవడంతో విషయాన్ని తెలుసుకున్న బిజెపి నాయకులు శుక్రవారం ఆసుపత్రికి వచ్చి సరిత బంధువలను పరామరించి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిశువు మరణానికి కారుకులైన వైద్యులతోపాటు ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో లేకపోవడం మూలంగానే ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయన్నారు. బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రికి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే ఆసుపత్రిని పట్టించుకోకపోవడం మూలంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కొర్ర రవిశంకర్, నూతి శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, కృష్ణంరాజు, కిషోర్, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో ఘనంగా ఫలహార బండ్ల ఊరేగింపు


మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ తదితరులు


ఉప్పల్‌లో ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** మహంకాళి బోనాల ఉత్సవాల సందర్భంగా ఉప్పల్‌లో పలువురు పార్టీ నేతలు, యువజన సంఘాల నేతలు ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ ఎస్.శిరీష సోమశేఖర్‌రెడ్డి, పలువురు ఉప్పల్ డివిజన్ నేతలు, కాలనీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఉప్పల్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా అమ్మవారి ఆలయంవరకు ఫలహార బండి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర నుంచి వచ్చిన కళాకారులు వివిధ దేవతామూర్తుల వేషధారులతో నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ప్రధాన రహదారుల మీదుగా భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. అదేవిధంగా మహంకాళి బోనాల ఉత్సవాల సందర్భంగా బిజెపి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, గొరిగె కృష్ణ, ధర్మారెడ్డి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వాదంతో నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు మహంకాళి లక్ష్మణ్, జి.శ్రీనివాసశర్మ, రావుల బాలకృష్ణ, యు.బి.చారి, డా.శిల్పారెడ్డి, కొల్లు బాలరాజు, డివిజన్ అధ్యక్షుడు రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, మార్నెని పణీందర్, సింగారం కార్తీక్, రేవల్లి రాజు, నాని నాగరాజుగౌడ్, వర్కల రాజేందర్, ఆకుల ఋషికేష్, నామ శ్రవణ్, అమరేందర్ పాల్గొన్నారు. బిజెవైఎం నేతలు బోరంపేట మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు నిర్వహించారు.

# హరితహారం స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు కృషి


మొక్కలు నాటుతున్న చైర్మన్ కెపి శ్రీనివాసరావు తదితరులు

**సరూర్‌నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన హరితహారం కార్యక్రమ స్ఫూర్తితో ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని ఎంవిఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కెపి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. నాదర్‌గుల్‌లోని ఎంవిఎస్ఆర్ కాలేజీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హరితహారం చాలా మంచి కార్యక్రమమనీ దీని వల్ల ప్రకృతికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కృష్ణకుమార్, కోశాధికారి జూపూడి సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్‌జిఎస్ మూర్తి, పలువురు హెచ్ఓడిలు, ఎన్ఎస్ఎస్ అధికారి మాటూరి శరత్ చంద్ర, శ్యామ్ ప్రసాద్, పలువురు లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ : శ్వేత


చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** సైదాబాద్ మండల తహాశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో యాకుత్‌పుర ఎమ్మెల్యే పాషాఖాద్రి, ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డిలు కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సుమారు 120 చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుగుట్ట ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

**ఉప్పల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** శ్రావణ మాసం సందర్భంగా ఉప్పల్ వెలుగుగుట్ట శ్రీ దుర్గా మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం ఆలయంలో ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృత అభిషేకం, శ్రీ సూక్త దుర్గా సూక్త విధానంతో మహా అభిషేకము, అలంకారము, మహాసునలచే కుంకుమార్చన, వడి బియ్యం అత్యంత వైభవంగా నిర్వహించారు. పలువురు మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని నిర్వహించారు. విశేష అర్జిత సేవలలో పాలుపంచుకుని భక్తులకు జగన్మాత అనుగ్రహించాలని దేవాలయం అర్చక సిబ్బంది వేడుకున్నారు. సామూహిక వరలక్ష్మి వ్రతాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

# ద్వారకామాయి పీఠంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం


వరలక్ష్మి వ్రతం సందర్భంగా కొలువు దీరిన అమ్మవారు

**సరూర్‌నగర్, ఆగస్టు 5 ప్రభాత వార్త:** మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో శుక్రవారం శ్రావణమాస వరలక్ష్మీవ్రత పూజలు వైభవంగా జరిగాయి. ద్వారకామాయి సాయి బాబా పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ మంగళ శాసనములతో పీఠం మాతాజీ మల్లాది విజయశ్రీ భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠంలో సాయిబాబా సన్నిధిలో సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని సాయి భక్తురాలు పద్మ ప్రియాంక పాడిన ఆధ్యాత్మిక పాట విశేషంగా అలరించింది. అనంతరం తీర్థప్రసాద వితరణ, మహిళలకు పసుపుబొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు.

# టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం : మల్‌రెడ్డి రంగారెడ్డి


రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న రంగారెడ్డి తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** మునుగోడు నియోజకవర్గం చండూర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సభకు బయలుదేరుతున్న టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డికి అబ్దుల్లాపూర్‌మెట్ ఔటర్‌రింగ్ రోడ్డు కూడలి వద్ద ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన నాయకులు చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి పేదలకు అండ


లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తుందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగినకార్యక్రమంలో సుమారు 75మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. సుమారు రూ. 30 లక్షల 37వేల 500 విలువగల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి : సిఐ సతీష్


సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ సతీష్ తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 5 ప్రభాతవార్త:** సిసి కెమెరాల ఏర్పాటు చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సతీష్ పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేటలో ప్రధాన ఆలయాలైన పోచమ్మ ఆలయంలో ఏర్పాటు చేసి సిసి కెమెరాల ఆపరేటింగ్ సిస్టంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సిసి కెమెరా 100 పోలీసులతో సమానమన్నారు. ఆలయంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బోనాల ఉత్సవాలు నిర్వహించడంలో ఆలయ ప్రతినిధులు ఎంతో తోడ్పాటునందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, పిటి శంకర్‌ముదిరాజ్, తులసి సురేష్‌కుమార్, మల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్ చౌకి రవికుమార్, పూజారి శ్రీనివాసాచారి, సభ్యులు ముప్పిడి శ్రీనివాస్, ఎస్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


పారిశుద్ధ్య కార్మికులచే స్ప్రే చేయిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**తుర్కయాంజల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అబ్దుల్లాపూర్‌మెట్ హెల్త్ సూపర్‌వైజర్ నరసింహ అన్నారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ 14వ వార్డులో ఖాళీ స్థలాల్లో నీరు చేరి దోమలు వ్యాప్తి చెందకుండా మున్సిపాలిటీ సిబ్బందితో టేమో పాస్ స్ప్రే పిచికారి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమకాటు గురికాకుండా ఉండాలంటే చెత్తా చెదారం తొలగించి పరిసర ప్రాంతాలను శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ జంగయ్య, అధికారి శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, హెల్త్ ఆఫీసర్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# సంతోష్‌నగర్‌లో ఘనంగా వరలక్ష్మి వ్రతం


శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

**సైదాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** సంతోష్‌నగర్‌లోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6.30కు శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి, గోదాదేవి అమ్మవారికి పంచామృతములతో అభిషేకం, అలంకరణ, రజత పుష్పార్చన, సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక లక్ష్మీనారాయణ పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రధాన అర్చకులు నలదీగ శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి


చిన్న చెరువు కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**రామంతాపూర్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** రామంతాపూర్ చిన్న చెరువు వద్ద ఉన్న శ్రీ కట్టమైసమ్మ ఆలయం అభివృద్ధికి తన వంతు చేయూత అందిస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం చిన్న చెరువు శ్రీ కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటి నేతలు బాపట్ల కృష్ణ మోహన్, పలువురు పార్టీ నేతలు పూజలు నిర్వహించారు. ఆలయం అభివృద్ధికి తన వంతు చేయూత అందిస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేత దర్శనం వినోద్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగకు మల్‌రెడ్డికి ఆహ్వానం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** బోనాల పండగ సందర్భంగా సరూర్‌నగర్ డివిజన్ విజయపురికాలనీలోని పోచమ్మ, యల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల (మూడుగుళ్ళు)గుడి వద్ద ఆదివారం నిర్వహించే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేప సురేఖభాస్కర్‌రెడ్డిలను హాజరుకావాలని శుక్రవారం కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. సాయంత్రం శ్రీ మైసమ్మ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు ఖిల్లామైసమ్మ దేవాలయంవరకు ఊరేగింపు కార్యక్రమానికి హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, ప్రధానకార్యదర్శి బండి మధు, నల్లంకి ధనరాజ్‌గౌడ్, బొక్క భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిభిరాలు పేదలకు మేలు చేస్తాయి : డిప్యూటీ మేయర్


వృద్ధురాలికి మందులను ఇస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత

**తార్నాక, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిభిరాలు పేదలకు ఎంతో మేలుచేస్తాయని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాకలోని ఐనోన్ చర్చి మినిస్ట్రీస్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రయం హాండ్ ఆఫ్ హోప్‌ఆద్వర్యంలో ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆమె శిభిరాన్ని ప్రారంభించారు. ఏళ్ల తరబడి పేదలకు సేవలందిస్తున్న చర్చి పాస్టర్ రెవ. విలియం కేరిని డిప్యూటీ మేయర్ అభినందించారు. ఈ శిభిరంలో సాధరణ సేవలతో పాటు 18 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అద్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్ కెనడి, చర్చిపాస్టర్ సుదర్శన్, తెరాస నాయకులు బిందెల స్వామి తధితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఐటిఐ ప్రాక్టికల్స్ పరీక్షల్లో అవకతవకలు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఈనెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ప్రైవేటు ఐటిఐ ప్రాక్టికల్స్ పరీక్షల్లో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయని, ఈ విషయంపై విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలని ఆలిండియా ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు జానకిరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కమిషనరేట్ ఆఫ్ ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ గవర్నమెంట్ ఐటిఐ క్యాంపస్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క విద్యార్థి నుంచి వేలాది రూపాయలు వసూలు చేసి ప్రాక్టికల్స్ నిర్వహించే గదిలో వారిని బొమ్మల కూర్చోబెట్టి ప్రాక్టికల్స్ చేసినట్లు యాజమాన్యాలు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున లక్షలాది రూపాయలు చేతులు మారాయని, యాజమాన్యాలు చేస్తున్న తీరుతో భవిష్యత్తులో విద్యార్థుల పరిస్థితి అయోమయంగా తయారవుతుందన్నారు. ప్రాక్టికల్స్ వ్యవహారంలో జరుగుతున్న అవకతవకలపై ప్రభుత్వం వెంటనే విజిలెన్స్ అధికారులతో సమగ్ర దర్యాప్తు జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

# సీలింగ్ చట్టాన్ని అమలు చేసి రైతులకు పట్టాలివ్వాలి : సిపిఎం


నాదర్‌గుల్ ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

**సరూర్‌నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్ సర్వే నెంబర్ 613లో చాలా సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రైతులకు అండగా ఆ పార్టీ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్లు మాట్లాడుతూ సదరు సర్వే నెంబర్‌లో సాగు చేసుకుంటున్న రైతులకు గుండాల నుండి రక్షణ కల్పించాలనీ సీలింగ్ చట్టాన్ని అమలు చేసి వారికి పట్టాలివ్వాలని అన్నారు. రైతుల పక్షాన తాము వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాడిగళ్ళ భాస్కర్, బాలాపూర్ మండల కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జగదీశ్, కవిత, సామెల్, మండల కమిటీ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, స్థానిక రైతులు కర్రె యాదయ్య, నాగేశ్, చిర్ర శ్రీనివాస్, రాముగౌడ్, శ్యామల, స్వరూప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# మూసి ప్రాంతవాసుల అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

**ఎల్.బి.నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** మూసి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నాగోల్ మూసి పరివాహక ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు మూసి పరివాహక ప్రాంతాల్లో పర్యవేక్షణ చేస్తూ, ప్రజలకు జాగ్రత్తగా గురించి సూచనలు చేయాలని తెలిపారు. మరో 2 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేశామన్నారు. బాక్స్ డ్రైన్స్ పనుల నేపథ్యంలో పలు కాలనీవాసులు అధికా రులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

# ధర్నాకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**ఉప్పల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం నుంచి పలువురు పార్టీ నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చలో ఇందిరాపార్కు కార్యక్రమానికి తరలివెళ్లారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు విపరీతంగా పెంచి సామాన్యులపై భారం మోపుతున్నారన్నారు. పేదలకు న్యాయం జరిగేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.

# ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

## పట్టించుకోని నాయకులు, అధికారులు


ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని గడ్డిఅన్నారం డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ సభ్యుడు లంక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గత నెల రోజుల క్రితం న్యూగడ్డిఅన్నారం కాలనీ సంక్షేమ సంఘం భవనం వద్ద మ్యాన్‌హోల్ పైకప్పు పగిలిపోవడంతో స్థానికులు అందులో కర్రలు పెట్టి ప్రమాద సూచికను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.